www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 15 అక్టోబర్ 2024
5
వైఎస్ఆర్

ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్‌పి.వి.హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లు సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదులను సకాలంలో సత్వర న్యాయం చేస్తారని పేర్కొన్నారు.

రాయబేరాలు!

జిల్లా వ్యాప్తంగా రాజకీయ జోక్యం
139 మద్యం దుకాణాల కేటాయింపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో మద్యం దుకాణాలు దక్కించుకున్న దరఖాస్తుదారులతో రాయబేరాలు ఊపందుకున్నాయి. కడప జిల్లాలోని ఏడు అసెంబ్లీ పరిధిలోని అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకత్వం లాటరీ పద్ధతిలో దుకాణాలు దక్కించుకున్న వారిపై కన్నేసింది. ఎలాగైనా వారిని దక్కిన దుకాణాలను కలిసి ఒంటరిని అవసరమైన ఎత్తులు వేస్తోంది. లాటరీలో దక్కిన దుకాణాలను తమ అనుచరులను కట్టబెట్టడంలో భాగంగా సామ, దాన, బేధ, దండోపాయాలను అటక మీద నుంచి దించింది. రాజకీయ ఒత్తిళ్ల బారి నుంచి తప్పించుకు నేందుకు ఎటువంటి అవకాశం కనిపించని ఆశావహుల్లో అయోమయం నెలకొంది.

జిల్లాలో నూతన మద్యం పాలసీ ప్రక్రియ కోలాహలం మధ్య ముగిసింది. ప్రభుత్వం ఈ నెల ఒకటి నుంచి 14 నాటికి నూతన మద్యం పాలసీని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు కడపలో జిల్లా పరిషత్ సమావేశహాలులో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన, అన్నమయ్యలో అజయ్ ఫంక్షన్ హాలులో ఆయా జిల్లాల కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల అధ్యక్షతన ఎక్సైజ్ శాఖ లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియను నిర్వహించింది.

లాటరీ తీస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

వర్షంలోనూ పడిగాపులు

బంగాళాఖాతంలో అల్పపీడనద్రోణి ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో మద్యం దుకాణాల కేటాయింపు వ్యవహారం నడిచింది. సోమవారం తెల్లవారుజాము నుంచి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న మోస్తరు వర్షాన్ని లెక్క చేయకుండా కడప జిల్లాలోని 139 దుకాణాలకు సంబంధించిన 3,257 మంది, దరఖాస్తుదారులతో జడ్‌పి సమావేశ హాలు ప్రాంగణం బయటి వరకు వేలాది మందితో కిక్కిరిసి పోయింది. సోమవారం నాటి లక్కీడ్రాలో అత్యధికంగా 124 దుకాణానికి 53 దరఖాస్తులు రావడం గమనార్హం. కడప జిల్లాలోని 139 మద్యం దుకాణాల్లో 132 పురుషులు, ఏడు దుకాణాలను మహిళలు దక్కించుకోవడం విశేషం.

బందోబస్తు మధ్య ప్రవేశాలు

జిల్లా పరిషత్ సమావేశ ప్రాంగణం పకడ్బందీ పోలీస్ బందోబస్తు, తనిఖీల మధ్య లక్కీడ్రాకు దరఖాస్తుదారులను అనుమతించింది. నాలుగు దశల తనిఖీల్లో ప్రధానంగా ఐడెంటికార్డు, దరఖాస్తుకు సంబంధించిన ఫారాలకు సంబంధించిన ఆధారాలను పరిశీలన తరువాత అనుమతించింది. ఎటువంటి గందరగోళ వాతావరణం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంది. సమావేశ హాలులోనూ లాటరీ ముగిసిన ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దరఖాస్తుదారులను పంపించడం, మిగిలిన దుకాణాలకు లాటరీలను నిర్వహించింది. పకడ్బందీ దుకాణాల కేటాయింపు వ్యవహారాన్ని సజావుగా నిర్వహించింది.

రాజకీయ మంతనాలు

లాటరీ విధానంలో దుకాణాలు దక్కిన ఆనందంలో ఉండగానే సదరు దరఖాస్తుదారులపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగిపోవడం కనిపించింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ పరిధిలోని అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు తమ అనుచరులకు దుకాణాలను ఇప్పించడంలో భాగంగా లాటరీ దక్కించుకున్న సామాన్యులను పిలిపించుకుని మంత్రాంగం నెరపడం ఏమిటనే వాదన వినిపిస్తోంది. దరఖాస్తు ప్రారంభ దశలోనూ ఇటువంటి ఒత్తిళ్లు రావడంపై విమర్శలు వెల్లువెత్తడం తెలిసిందే. ఇటువంటి అవాంతరాలను దాటుకుని లాటరీ దక్కించుకున్న తమపై సామ, దాన, భేద, దండోపాయాల రూపంలో బెదిరింపులకు పాల్పడడం ఏమిటనే వాదన వినిపిస్తోంది. తాము ఎంతో కష్టపడి దరఖాస్తు దాఖలు చేసుకుని, లాటరీలో తగిలిన అవకాశాన్ని రాజకీయ నాయకత్వం తన్నుకు పోవడమేమిటనే వాదన వినిపిస్తోంది.

నూతన మద్యం పాలసీ విధానం ప్రకారం కడప జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్ల వారిగా దుకాణాల వివరాలు.జిల్లాలో మద్యం దుకాణాల వివరాలు.. కడప-30, సిద్ధవటం-8, ఎర్రగుంట్ల-14, జమ్మలమడుగు-14, ప్రొద్దుటూరు-19, పులివెందుల-16, ముద్దనూరు-7, మైదుకూరు-16, బద్వేలు -15 మొత్తం 139 దుకాణాలు ఏర్పాటయ్యాయి.

నిర్వాసితుల భూములు కాపాడాలి

- వ్య.కా.స జిల్లా కార్యదర్శి అన్వేష్

ప్రజాశక్తి - కడప అర్బన్

గండికోట ప్రాజెక్టుకు నిర్వాసితులైన చౌటుపల్లె ప్రజలకు కేటాయించిన భూములు అన్యాక్రాంతమయ్యాయని, వెంటనే ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని నిర్వాసితులకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్‌ఒకు చౌటపల్లి గ్రామం నిర్వాసితులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ గండకోట ప్రాజెక్ట్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ముద్ద నూరు మండలం మంగపట్నం రెవెన్యూ పొలంలో కేటాయించిన భూములకు జిల్లా అధికారులు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆ భూములు రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన వారు, డబ్బున్న వారు, అన్యూరులు, స్థానికేతర్లు పెద్ద ఎత్తున వందల ఎకరాలు ఆక్రమిం చుకుంటున్నారని తెలిపారు. 2010 సంవత్సరంలో చౌటపల్లి గ్రామం నిర్వాసితులకు కేటాయించిన భూములు 869 ఎకరాలకు ప్రభుత్వం జంగల్ క్లియరెన్స్ కు రూ.31,29,696 ఖర్చు చేసిందన్నారు. ఆ భూములకు ఇప్పటికే అసైన్‌మెంట్‌లో ఆమోదం పొందిన పట్టాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు. నిర్వాసితులకు పట్టాలు ఇవ్వకుండా జిల్లా ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు చాలా నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. అన్యక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుని నిర్వాసితులందరికీ మూడు ఎకరాల చొప్పున భూ పంపిణీ చేసి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో మూడున్నర లక్ష నిర్వాసితుల కుటుంబ సభ్యులకు అందరికీ ఇవ్వలేదని, పెండింగ్‌లోనే ఉన్నాయని చెప్పారు. నిర్వాసితులు తమ పరిహారం ఇవ్వాలని అడిగితే అధికారులు బడ్జెట్ లేదని దాటేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే పరిహారం లబ్ధిదారులందరికీ ఇవ్వాల న్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.12 లక్షలు అమలు చేస్తామని ఎన్నికలలో వాగ్దానం చేశారని, అ వాగ్దానమేరకు వెంటనే నిధులు విడుదల చేసి నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిర్వాసితులను కలుపుకుని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో చౌటపల్లి నిర్వాసితులు రామలింగారెడ్డి, యోహాన్, గురు ప్రసాద్ పాల్గొన్నారు.

డిఆర్‌ఒ కు వినతిపత్రం అందజేస్తున్న అన్వేష్

మండలాభివృద్ధికి సహకారం అవసరం : ఎమ్మెల్యే

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి

ప్రజాశక్తి-చెన్నూరు

అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షులు చీర్ల సురేష్ యాదవ్ అధ్యక్షత నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 4 కోట్లతో మండలంలో అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. డ్రెయినేజీ, సిమెంట్ రోడ్లు, తాగునీటి వంటి పనులకు కేటాయించామని చెప్పారు. మండలంలోని ప్రతి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కడప- కర్నూల్ జాతీయ రహదారిలోని పాత టోల్ గేటు వద్ద రోడ్డుకు ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేయాలని హైవే అధికారులను ఆదేశించారు. చెన్నూరు కొత్త రోడ్డులో బస్సు షెల్టర్ నిర్మాణానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. పాత రోడ్డు నుంచి పాత బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రైతులకు పొలంబడి ఎంతో ఉపయోగపడుతుందని వినియోగించుకోవాలని అన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని వ్యవసాయ అధికారికి సూచించారు. వ్యవసాయ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. చెన్నూరులోని అండర్ డ్రెయినేజీకి, సిమెంట్ రోడ్డుకు నిధులు కేటాయిస్తామని శాసన సభ్యులు తెలిపారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్వాడీ స్కూల్‌లో కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మండల సమస్యలు శాసనసభ్యులు దృష్టికి తేగా అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని ఆయన అన్నారు. రైతు మాట్లాడుతూ బుడ్డయాపల్లి చర్చి వద్ద కల్వర్టు తక్కువ ఎత్తులో ఉండడం వల్ల వర్షపు నీరు నిలబడి వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు కష్టంగా ఉందని చెప్పారు. పిఆర్ ఎఇతో మాట్లాడి కల్వర్టు ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ ఆర్ ఎస్ ఆర్(చిన్న), సర్పంచులు ఎస్వి నారాయణరెడ్డి తుంగ చంద్ర యాదవ్, సుదర్శన్ రెడ్డి, ఎంపిటిసిలు నాగిరెడ్డి, ఉప సర్పంచ్ పుత్త, వేణుగోపాల్ రెడ్డి, అధికారులు ఎంపిడిఒ కిరణ్ మోహన్‌రావు, తహశీల్దార్ వెంకటరమణ, ఎఇ రామలింగారెడ్డి, యువిఆర్‌డి సురేష్ బాబు, డాక్టర్లు చెన్నారెడ్డి, సతీష్ కుమార్, కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, సిఐ పురుషోత్తమ రాజు, చెన్నూరు పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముసురు!

- రైల్వేకోడూరులో 94.6 మి.మీ
- 10 మండలాల్లో సున్నా వర్షపాతం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ముసురు వాతావరణం నెలకొంది. సోమవారం తెలవారుజామున సన్నటి జల్లులు మొదలుకుని సాయంత్రం వరకు మోస్తరు వర్షానికి పరిమితమైంది. అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరులో 94.6 మి.మీ వర్షపాతం, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు, నందలూరు మండలాల్లో 55 మి.మీ వర్షపాతం నమోదు కావడం మినహా మిగిలిన మండలాల్లో మోస్తరు జల్లుల ప్రభావం కనిపించింది. కడప జిల్లాలో సిద్ధవటం మండలంలో 29.6 మి.మీ వర్షపాతం నమోదు కావడం మినహా మిగిలిన 35 మండలాల్లో మోస్తరు వర్షపాతం నమోదైంది. కమలాపురం, జమ్మలమడుగు డివిజన్ల పరిధిలోని పది మండలాల్లో ఆకాశం మేఘావృతం కావడం మినహా ఎటువంటి ప్రభావం కనిపించ లేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనద్రోణి ప్రభావం తొలి రోజు ఎటువంటి ప్రభావమూ చూపించలేదు. ప్రభుత్వ విపత్తుల నిర్వహణశాఖా భారీ నుంచి అతిభారీ తుపాన్ వచ్చే ప్రమాదం ఉందనే వాతావరణం నేపథ్యంలో కలెక్టరేట్ డివిజన్ల వారీగా కంట్రోల్ రూములను ఏర్పాటు చేసి ఫోన్ నెంబర్లు ఇచ్చి పర్యవేక్షిస్తోంది.

ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి కడప అర్బన్ : సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా 5050 మంది ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ల పోస్టుల కోసం డిఎస్‌సిలో ఇచ్చే ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని కడప అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సి.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత కలిగి ఉండి, వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉన్న ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు ఈనెల 21 లోపు జ్ఞానభూమి వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27న స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. మెరిట్ లిస్టు ప్రకారం ఉచిత శిక్షణ తీసుకునేందుకు ఎంపికవుతారని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం www.jnanabhumi.ap.gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

వైవీయూ రిజిస్ట్రార్ రాజీనామా ఆమోదం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు తప్పెట రామ ప్రసాద్ రెడ్డి రిజిస్ట్రార్ ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పుకున్నారు. వ్యక్తిగత కారణాల దృష్ట్యా విధుల నుంచి రిలీవ్ చేయాలని విసిని కొద్దిరోజుల కిందట కలిసి రాజీనామా పత్రం అందజేశారు. ఆయన విజ్ఞాపన మేరకు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ విధుల నుంచి రిలీవ్ చేసినట్టు విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి వెల్లడించారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగర ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి అన్నారు. సోమవారం బికెఎం వీధికి చెందిన వంకదారి రాము తన మిత్ర బృందంతో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యే సమక్షంలో తెలుగు దేశం పార్టీ చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నగర ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రశాంతంగా ఉన్నారని చెప్పారు. తమకు రాజకీయ కుటుంబ నేపథ్యం ఉందని, దాంతో కడప ప్రజలకు స్వచ్ఛందంగా సేవ చేయడమే ధ్యేయంగా పని చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ -2047 స్ఫూర్తితో యువకులంతా తెలుగు దేశం పార్టీ లో చేరుతున్నారని రాము మిత్ర బృందాన్ని ఆమె అభినందించారు. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో భూకబ్జాలు ఎక్కువగా జరిగాయని, వాటిపై దృష్టి సారించి వారందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. టిడిపిలో చేరిన వంకదారి రాము మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ - 2040 తోపాటు, ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి టిడిపిలో చేరినట్లు తెలిపారు. చేరిన వారిలో కుంచం రామ్మూర్తి, రమేష్, సాయి కృష్ణ, మేడా నరసింహ, కత్తి బద్రి ఉన్నారు.

రాము మిత్ర బృందాన్ని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కడప : రాష్ట్ర వ్యాప్తంగా తుఫాను కారణంగా విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని రెవెన్యూ డివిజన్ల వారీగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో విస్తృతంగా పిడుగులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉండడంతో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూంతో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా ఏర్పాటు చేశామన్నారు. భారీవర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారాన్ని ఆయా రెవెన్యూ డివిజన్ల కంట్రోల్ రూమ్ నెంబర్లకు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, కడప కంట్రోల్ రూమ్ : 08562 – 246344, కడప ఆర్‌డిఒ కార్యాలయం : 89854 29256, జమ్మలమడుగు ఆర్‌డిఒ కార్యాలయం : 9618804882, బద్వేల్ ఆర్‌డిఒ కార్యాలయం : 917013323862, పులివెందుల ఆర్‌డిఒ కార్యాలయం : 85200 82425,95422 99885 ద్వారా ప్రజలు సమాచారం అందించాలన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి - కడప

అర్జీదారులు విన్నవించే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన పరిష్కారాన్ని వేగవంతంగా అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) హాలులో డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, నేషనల్ హైవేస్ ఎస్‌డిసి వెంకటపతి, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి లతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్‌ఎ, రీఓపెనింగ్. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయకుమార్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శాఖ జేడీ నాగేశ్వరరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, సిపిఒ వెంకటరావు, ఎస్‌సి కార్పోరేషన్ ఇడి బ్రహ్మయ్య, బిసి కార్పోరేషన్ ఇడి జయసింహ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన పలు ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధనలక్ష్మి, నారాయణస్వామి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, నగరపాలక శాఖధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

కడప డిఎస్‌పిగా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్



కడప డిఎస్‌పిగా ఎ. వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1991 బ్యాచ్ కు చెందిన ఈయన ఎస్ఐగా కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పనిచేశారు. 2005లో ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ పొందిన తర్వాత కూడా కర్నూలు, కడప, అనంతపురంలో విధులు నిర్వహించారు. అనంతపురం జిల్లాలోనే విధులు నిర్వహిస్తున్న సమయంలో డిఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొందారు. కర్నూలు సిఐడి విభాగం నుంచి కడపకు బదిలీ అయ్యారు. 1996- 97 సంవత్సరంలో కడప సిసిఎస్‌లో విధులు నిర్వహించిన సమయంలో స్టువర్టుపురం దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ. రెండున్నర కోట్లు వసూలు చేయడంలో కీలక పాత్ర వహించారు. సిద్ధవ టం, చక్రాయపేట, లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్లలో ఈయన వివిధ స్థాయిలో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కడప సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు పోలీస్ సిబ్బందిని కఠినంగా వ్యవహరించేలా చూస్తామన్నారు. ప్రజల రక్షణ, ధన,మాన ప్రాణాలను రక్షించుటలో పోలీస్ పాత్రను ఇనుమడింపజేసేలా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేస్తామని తెలిపారు. ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కడప సబ్ డివిజన్ పరిధిలో పోలీసు పనితీరు సమర్థవంతంగా నిర్వహించిన చూస్తామని చెప్పారు. ప్రజల అవసరాలకు, వారి రక్షణకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి రక్షణగా ఉంటామని తెలిపారు.

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సురేఖ

వైద్య సేవకు అంకితం కావాలి

ప్రజాశక్తి - కడప సిటీ

విద్యార్థులు వైద్య సేవకకు అంకితం కావాలంటే అకుంఠిత దీక్ష, పట్టుదల, సేవా భావం కల్గి ఉండాలని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ పేర్కొన్నారు. మొదటి సంవత్సరం వైద్య విద్యలో ప్రవేశించే విద్యార్థులకు సోమవారం ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్ విజయ భాస్కర్ రెడ్డి ఆహ్వానం పలికారు. ముందుగా ఆమె జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ రోజూ అధ్యాపకుల సూచనలతో విద్యను నేర్చుకోవాలన్నారు. మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలంటే వ్యాయామం తప్పనిసరి అన్నారు. అందుకు విశాలమైన కళాశాల మైదానాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. మానవ సేవ మాధవ సేవ కాబట్టి ప్రతిరోగికి వైద్య సహాయాన్ని శ్రద్ధగా చేయాలన్నారు. మంచి నడవడికతో భవిష్యత్తును దిద్దుకొనే లాగా తల్లిదండ్రులు అనుక్షణం వారిని కనిపెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ డాక్టర్ సునీల్, లక్ష్మీ నరసమ్మ, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పల్లె పండుగ వారోత్సవాలు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : గ్రామసభల్లో చేసిన తీర్మానాలను అనుగుణంగా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పల్లె పండుగ వారోత్సవాలు మండలంలోని బుసిరెడ్డిపల్లెలో ప్రారంభించారు. పంచాయతీలోని పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కులాయి బాబు, ఉపాధి ఎపిఒ రామానుజన్‌రెడ్డి ఇఒపిఆర్‌డి వెంకటసుబ్బారెడ్డి అధికారులు, సర్పంచ్ మహేశ్వరి, బులిసిరెడ్డి పల్లె ఎంపిటిసి రమణారెడ్డి, నాయకులు పేరు ప్రసాద్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

వల్లూరు : వల్లూరు మండలం కస్తూర్బా పాఠశాలకు వెళ్లే రహదారిలో రూ. 10 లక్షల నిధులతో చేపట్టబోయే రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్ రెడ్డి, జనసేన కమలాపురం నియోజవర్గ ఇన్‌ఛార్జి ఇంది రెడ్డి వేణుగోపాల్ రెడ్డి, ఎంపిడిఒ రఘురాం, ఎంఇఒ లిల్లమ్మ, మండల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో బదిలీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులను బదిలీ చేస్తూ ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎస్ఐలు 14 మంది, హెడ్ కానిస్టేబుల్ 19 మంది, పోలీసులు 44 మందిని బదిలీ చేశారు. బదిలీ అయిన వారు ఆయా పోలీస్ స్టేషన్లలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బిసి హాస్టళ్లల్లో జడ్జి పరిశీలన

ప్రజాశక్తి - కడప : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ. శ్రీదేవి సూచనల మేరకు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కడప నగరంలో ఉన్న బిసి హాస్టళ్లను సోమవారం పరిశీలించారు. కడప నగరంలో ప్రకాష్ నగర్‌లోని స్కూల్, కళాశాల, బిసి హాస్టల్‌ను, బాలాజీ నగర్‌లో ఉన్న బిసి హాస్టల్‌ను, కోపరేటివ్ కాలనీలో ఉన్న బిసి హాస్టల్‌ను సందర్శించారు. వంటశాలను, వసతి గదులను, డైనింగ్ హాలును, స్టోర్ రూమును, పరిసరాలను పరిశీలించారు. తగు సూచనలు సలహాలు ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 తదితర అంశాలను వివరించారు, కార్యక్రమంలో బిసి హాస్టల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న ఎస్ఇ రమణ

వర్షాల వల్ల కలిగే విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యలపై జిల్లా అంతట ఐదు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాల వల్ల కలిగే విద్యుత్ ప్రమాదాల పట్ల అప్ర మత్తంగా ఉండేందుకు పలు సూచనలను పాటించాలన్నారు. వర్షాలు , గాలులు ఎక్కువగా వస్తున్నప్పుడు లేదా నీటి నిలువ ఎక్కువగా ఉన్న చోట కరెంటు స్తంభా లను తాకరాదని చెప్పారు. ఇంట్లో నెమ్ముగా ఉన్న లేదా తడిచిన స్విచ్ బోర్డ్‌లను చేతులతో తాకకుండా పొడిగా ఉన్న కట్టె పుల్ల ద్వారా లేదా ప్లాస్టిక్ వస్తువుల ద్వారా స్విచ్‌లను వేసుకోవాలని తెలిపారు. కరెంటు వస్తువులను చేతులతో తాకరాదన్నారు. రైతులు వారి విద్యుత్ మోటార్ల దగ్గర జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఎక్కడైనా కరెంటు లైన్లు తెగి పడిన, స్తంభాలు, విరిగి పడిన సంబంధిత లైను మెన్‌కి కానీ, సంబంధిత సబ్ స్టేషన్‌కి కానీ, కంట్రోల్ రూమ్‌లకు వెంటనే తెలియజేయాలన్నారు. విద్యుత్ సమస్యల ఫిర్యాదు టోల్ ఫ్రీ నెంబర్ 1912 కాల్ చేసి పరిష్కరించుకోవాలని తెలియజేశారు. ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని నాలుగు విద్యుత్ డివిజన్లలో నాలుగు, జిల్లా కేంద్రంగా ఒకటి మొత్తం ఐదు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని తెలియజేశారు. విద్యుత్ సమస్యలపై కడప జిల్లా కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 9440817440, కడప డివిజన్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 9440 817441, పులివెందుల డివిజన్ 9491431255, ప్రొద్దుటూరు డివిజన్ 78 93261958, మైదుకూరు డివిజన్. 9492873325 కంట్రోల్ రూమ్ నంబర్లకు సంప్రదించవచ్చునని తెలిపారు. ప్రజలు పైన తెలిపిన విద్యుత్ జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

పంటల సమాచారం తెలియజేయండి

ప్రజాశక్తి - సిద్ధవటం : మండల పరిధిలోని 18 గ్రామపంచాయతీలో నివాసమున్న ప్రజలు తుఫాన్ కారణంగా దెబ్బతిన్న గృహాలు, పంటల వివరాలను వెంటనే తెలపాలని మండల డిప్యూటీ తహశీల్దార్ మాధవి లత అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయిన గృహ నిర్మాణదారులు స్థానిక గ్రామ సచివాలయంలో విఆర్‌ఒకు సమాచారం తెలపాలని అన్నారు. వర్షాల కారణంగా పంట పొలాలు దెబ్బతింటే హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులకు తెలియజేయాలని తెలియజేశారు

పెన్నా నదిలోకి ఎవరూ దిగవద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి - సిద్ధవటం : తుపాన్ సమయంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది పరివాహ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు పెన్నా నదిలోకి ఎవరు దిగవద్దని మండల ఎస్ఐ చిరంజీవి తెలియజేశారు మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా లోతట్టు పల్లె ప్రాంతాల ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నానరు. నదీ పరివాహ ప్రాంతాల్లో పెన్నా నదిలో సుడిగుండాలు, గుంతలు ఎక్కువ ఉన్నాయని ప్రమాదాలు తెచ్చుకోవద్దని పేర్కొన్నారు. హెచ్చరికను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. ఇటీవలే సిద్దవటం లోకాజ్వే వద్ద పెన్నా నదిలో దిగి చాలా మంది మృత్యువాత పడ్డారని అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

డిగ్రీ ఒకేషనల్ పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలో ఈ నెల 15 నుంచి జరగాల్సిన డిగ్రీ ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాను ప్రభావం అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాలపై ఉంటుందని ప్రకటించిన నేపథ్యంలో విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి విసి ఆచార్య కృష్ణారెడ్డి నిర్ణయం మేరకు పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఎగ్జిబిషన్ ఎంట్రీ ఫీజు దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)


మాట్లాడుతున్న జి.డేవిడ్‌రాజ్

ఎగ్జిబిషన్ ఎంట్రీ ఫీజును అధిక మొత్తంలో రాబడుతూ దోపిడీ చేస్తున్న వారిని అరికట్టాలని, అక్రమంగా వసూలు చేసిన డబ్బును తిరిగి ప్రభుత్వం స్వాధీనం పరుచుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం డేవిడ్‌రాజ్ కోరారు. ఆ మేరకు సోమవారం ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో ఎంట్రీ ఫీజు పేరుతో నియమ నిబంధనలకు విరుద్ధంగా గెజిట్లో రూ.25 వసూలు చేయాల్సి ఉండగా రూ.100 వసూలు చేసి ప్రజలను దోచుకుంటున్నారన్నారు. దీన్ని అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. దసరా ముందు రోజు, తర్వాత రోజు అధిక మొత్తంలో వసూలు చేసిన డబ్బును తిరిగి రాబట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు, మున్సిపల్ కమిషనర్‌పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఎగ్జిబిషన్‌ను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహన్, సమాద్ పాల్గొన్నారు.

నత్రజని ఎరువులు ఎక్కువ వాడరాదు

ప్రజాశక్తి - ముద్దనూరు

పంటలకు నత్రజని ఎరువులు ఎక్కువగా వాడరాదని ఎఒ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని యామవరం గ్రామ రైతు సేవా కేంద్రంలో సోమవారం ఎఒ ఆధ్వర్యంలో రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ యూరియాను పంటలకు అధికంగా వాడితే చీడపీడలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు నత్రజని ఎరువులు వాడుకోవాలని రైతులకు సూచించారు. యామవరం, ఉప్పలూరు, పెనికలపాడు రైతు సేవా కేంద్రాల్లో కోరమాండల్ గ్రాన్యులర్ యూరియా 19.98 మెట్రిక్ టన్నులు, డిఎపి 20 టన్నులు ఎరువు అందుబాటులో ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎఒ కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

'శివసూర్య' పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

1999-2000 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల సమ్మేళనం మైదుకూరులోని శివసూర్య హైస్కూల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల అప్పటి కరస్పాండెంట్ లింగాల నారాయణరావు, రామిరెడ్డి దంపతులు, ప్రస్తుత కరస్పాండెంట్ ఎస్.పోతులూరయ్య, ఎస్.భాస్కర్, ఎం.గిరిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్య నభ్యసించిన విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం చేసి, ఉద్యోగాలు సాధించడమే కాకుండా, క్రమశిక్షణకు మారుపేరుగా జీవితంలో వివిధ రంగాల్లో స్థిర పడ్డారన్నారు. ప్రస్తుత తరాలు విద్యార్థులు సక్రమమైన మార్గంలో ప్రయాణిస్తూ గురు పరంపరని కొనసాగించినపుడే భవిష్యత్తుకు భరోసా ఇచ్చిన వాళ్లమ అవుతామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్య అంతరాలు పెరగడంతో క్రమశిక్షణ రాహిత్యానికి దారితీస్తుందని, ఇలాంటివి పునరావృతం కాకుండా తల్లిదండ్రులు తమవైన బాధ్యతతో మెలగాలని ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులకు సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి 'మండిపల్లి'

ప్రజాశక్తి - రాయచోటి : జిల్లాలో ఈనెల 14,15,16 తేదీల్లో భారీ వర్షాలు పడుతున్న సందర్భంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ వ్యవస్థ, విపత్తు నిర్వహణ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం, జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అతి భారీ వర్షాలు పడే ప్రాంతాలలో ప్రజలకు ముందస్తుగా సమాచారం ఇచ్చి వారిని అప్రమత్తం చేయాలన్నారు. ప్రజల మొబైల్ ఫోన్‌లకు భారీ వర్షాలపై మెసేజ్ లు పంపి అలర్ట్ చేయాలన్నారు. వర్షాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వరద ప్రవాహాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగే అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

మినీ గోకులాలు పాడి రైతులకు ఊరట

ప్రజాశక్తి - సింహాద్రిపురం : ప్రభుత్వం పాడి రైతుల కోసం ఇస్తున్న మినీ గోకులాలు ఎంతో ఉపయోగకరమని ఎంపిడిఒ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని చవ్వారిపల్లెలో సోమవారం మినీ గోకులానికి ఆయన భూమిపూజ చేశారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ చట్టం ఇసి శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు, పాడి రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్ గుర్రప్పను సన్మానిస్తున్న సిబ్బంది

కొండాపురం తహశీల్దార్‌గా గుర్రప్ప

ప్రజాశక్తి - కొండాపురం : కొండాపురం తహశీల్దార్‌గా సోమవారం గుర్రప్ప బాధ్యతలు స్వీకరించారు. ఆయన సింహాద్రిపురం నుంచి కొండాపురం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గుర్రప్పకు స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు. గతంలో ఈయన కొండాపురం డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నేనా, సీనియర్ అసిస్టెంట్ సిద్దిక్, విఆర్‌ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు 'విశ్వజ్యోతి' విద్యార్థి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు బిహార్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి టార్గెట్ బాల్ పోటీలకు విశ్వజ్యోతి స్కూల్ విద్యార్థి ఎంపిక అవడం పట్ల ఆ పాఠశాల కరస్పాండెంట్ మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక పాఠశాలలో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల కారం వరుణ్ టార్గెట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు పరిమళ, పాఠశాల ప్రిన్సిపల్ కిరణ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబర చుటకు అవసరమైన అన్ని క్రీడా పరికరాలు, సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుంటూ మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు సంజీవ్, షాహినా, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థితో యాజమాన్యం

మందుబాబులకు అడ్డా.. ఆ రస్తా..!

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

తాగి పడేసిన గ్లాసులు.. మందు సీసాలు, రెవెన్యూ కార్యాలయానికి వెళ్లే దారి

ఎర్రగుంట్ల పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లే మార్గంలో దర్గా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఎర్రగుంట్ల, దాని చుట్టుపక్కల ఉండే గ్రామాల ప్రజలు తమ అవసరాల నిమిత్తం మండల రెవెన్యూ కార్యాలయానికి వస్తూ పోతుంటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కూడా తరచూ రోగులు వస్తుంటారు. ఇలాంటి జన సంచార ప్రదేశాల్లో కొంతమంది వ్యక్తులు పగలు, రాత్రి అనేతేడా లేకుండా మద్యం సేవిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమ పానం, మద్యం తాగడం, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవిస్తున్నారు. నేరాలను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు అనేక సార్లు తెలియజేస్తున్నప్పటికీ.. మందుబాబులు లెక్కచేయకుండా నిరంతరం జన సంచారం రస్తాలో మద్యం సేవిస్తున్నారు. అక్కడే గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు, మందు సీసాలు పడేస్తున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక కార్యాలయ సిబ్బంది చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పక్కనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా కూడా ఎవరికీ పట్టనట్లు వ్యవహరించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. పోలీసులు ఈ రస్తాలో సాయంత్రం వేళ గస్తీ నిర్వహిస్తే కొంతవరకు ఈ సమస్యను పరిష్కరించవచ్చని ప్రజలు సూచిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి విచ్చలవిడిగా బహిరంగ మద్యపానం చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రామమునిరెడ్డిని నామినేటెడ్ పదవి వరించేనా..!

ప్రజాశక్తి - వేంపల్లె

వైఎస్ఆర్ పాలనలో ఒక వెలుగు వెలిగిన సింగారెడ్డి రామమునిరెడ్డికి టిడిపి పాలనలో నామినేటెడ్ పదవి వరిస్తుందో లేదోనని అటు వైసిపి, ఇటు టిడిపి నాయకుల్లో ఆసక్తి నెలకొంది. వైఎస్ఆర్ పాలనలో జిల్లా నామినేటెడ్ పదవి చేపట్టి ఒక వెలుగు వెలిగిన రామమునిరెడ్డి వైఎస్ఆర్ మరణానంతరం వైసిపి కోసం కష్టపడినప్పటికీ ప్రయోజనం లేకపోవ డంతో టిడిపిలో చేరారు. అప్పటి నుంచి టిడిపి బలోపేతానికి రామమునిరెడ్డి కృషి చేశారు. వైసిపి పాలనలో టిడిపి కోసం పని చేయడానికి టిడిపి పార్టీ మండల కన్వీనర్ పదవి చేపట్టేందుకు ఏ ఒక్కరూ ముందుకు రాని సమయంలో పులి వెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవి అడుగులో అడుగు వేసేందుకు రామమునిరెడ్డి ముందుకు వచ్చారు. టిడిపి మండల కన్వీనర్ పదవిని చేపట్టారు. అప్పటి నుంచి వైసిపితోపాటు సొంత టిడిపి నాయకుల నుండే ఎన్నో అడ్డుకులు వచ్చినా, వాటిని ఎదురొడ్డి నిలిచారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా వైసిపి నేతలు రిగ్గింగ్ చేసు కోకుండా అడ్డుకోవడంతోపాటు సాధారణ ఎన్నికల్లో ప్రతి బూత్‌లో ఏజెంట్లు నిలపడం వరకు చాకచక్యంగా పని చేసిన వ్యక్తి రామ మునిరెడ్డినే అని చెప్పుకోవచ్చు. టిడిపికి అభి మానులు ఉన్నప్పటికి పార్టీ కోసం పని చేయ డానికి ముందుకు రాని సమయంలో కొందరి యువతను పెట్టుకొని పార్టీ పటిష్టత కోసం పాచికలు వేసి క్యాడర్‌ను నిలబెట్టారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపికి ఓట్ల శాతం పెరిగాయి అంటే అది రామమునిరెడ్డి కృషే కారణమని చెప్పవచ్చు. వైసిపి ప్రభుత్వ పాలనలో రామ మునిరెడ్డిని కొందరు భయభ్రాంతులకు గురి చేసినా ఆయన భయపడలేదు. టిడిపి క్యాడర్‌ను పెంచి వైసిపి ప్రభుత్వ చేసిన వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పాటు పడ్డారు. రామమునిరెడ్డి పార్టీ కోసం పని చేస్తున్న సమయంలో కొందరు ప్రధాన వైసిపి నాయకులే స్వయంగా అభినందించిన దాఖలులు కూడా ఉన్నాయి. పార్టీ కోసం పని చేసిన అలాంటి రామ మునిరెడ్డిని నామినేటెడ్ చెందిన కార్పొరేషన్ పదవి వరిస్తుందోలేదోనని ప్రతి టిడిపి నాయ కుడు ఎదురు చూస్తున్నారు. రామమునిరెడ్డి కూడా కష్టపడిన వారికి న్యాయం జరుగుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవికి నమ్మిన బంటుగా రామ మునిరెడ్డి ఉన్నారు. అలాంటి నమ్మినబంటును బిటెక్ రవి ఏ స్థాయికి చేర్చుతాడో వేచి చూడాల్సిందే.

గ్రామాల అభివృద్ధే 'పల్లె పండుగ' లక్ష్యం

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వరద

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రూరల్ పరిధిలోని చౌటపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నూతన సిసి రోడ్లకు సోమవారం ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి భూమిపూజ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పల్లె పండుగ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. 'ఉపాధి' మెటీరియల్ కాంపోనెంట్ కింద మంజూరైన పనుల్లో రాష్ట్ర వ్యాప్తంగా రూ.988 కోట్ల నిధులతో మూడు వేల కిలోమీటర్ల సిమెంటు రోడ్ల నిర్మాణాలను భూమిపూజ చేయనున్నారు. ఈ సందర్భంగా చౌటపల్లె పంచాయతీలో రూ.30 లక్షల అంచనాతో దాదాపు 650 మీటర్ల మేర నూతన సిసి రోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. చౌటపల్లి మాజీ సర్పంచ్ మార్తల ఈశ్వరమ్మ, మార్తల లక్ష్మీరెడ్డి, మార్తల వెంకటరామిరెడ్డి, రమణారెడ్డి, మునివర, గురజాల రామచంద్రారెడ్డి, మురళీ ధర్‌రెడ్డి, హరి బాబురెడ్డి, నాగార్జునరెడ్డి, దేవిరెడ్డి రమణారెడ్డి, పాతకోట రేవంత్‌రెడ్డి, మేకల ఇస్మాయిల్, మేకల సన్న, మేకల రాకేష్, మైఖేల్, కన్నయ్య పాల్గొన్నారు.

ముద్దనూరు : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తుందని ఎంపిడిఒ ముకుందరెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం బొందలకుంట గ్రామంలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. బొందలకుంట గ్రామ పంచాయతీలో రూ.9.30లక్షలతో సిసి రోడ్లు ఏర్పాటు చేసేందుకు పూజ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి, సర్పంచు గాలం మునీశ్వరి, ఎంపిటిసి సభ్యులు నల్లబోయిన వెంకటసుబ్బయ్య, ఈఓపిఆర్డీ వీరభద్రుడు, పశు వైద్యాధికారి హిమబిందు, ఎపిఎం అపర్ణ, ఎపిఒ గంగయ్య, ప్రజలు పాల్గొన్నారు.

వేముల : ఆగస్టు 23న నిర్వహించిన గ్రామసభల్లో తీసుకున్న తీర్మానాలకు అనుగుణంగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పంచాయతీ వారోత్సవాలల్లో భాగంగా సోమవారం వేముల గ్రామ పంచాయతీ, స్థానిక కేకే కొట్టాల గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎపిఎం ఆంజనేయులు, ఉపాధి హామీ ఇసి మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ సులోచన, ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

చాపాడు : జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా మండల పరిధిలో రూ.1.79 కోట్లతో సిమెంట్ రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని టిడిపి మండలశాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. పల్లె పండుగలో భాగంగా ఖాదరపల్లిలో సిమెంట్ రోడ్డుకు ఆయన భూమిపూజ చేశారు. పల్లె పండుగలో భాగంగా ఖాదర్‌పల్లి, నాగులపల్లి, పల్లవోలు గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామానుజం, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఉపాధి ఎపిఒ జగదీశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు నాయబ్, జైనుల్లా, నారాయణరెడ్డి, రజినీకాంత్, రామాంజనేయులు, రామ్మోహన్, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : తిప్పలూరు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో సిసి రోడ్డుకు సర్పంచు అంబటి పార్వతమ్మ, జనసేన నియోజకవర్గ కో-ఆర్డినేటర్ జగదీష్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణయ్య, అంబటి కృష్ణారెడ్డి, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇవిఎంలైతే 2029లో పోటీ చేయను : 'రాచమల్లు'

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

2029 ఎన్నికల్లో ఇవిఎంలే వినియోగిస్తే తాను పోటీ చేయనని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో ఇవిఎంలు గెలిచి ప్రజాతీర్పు ఓడిపోయిందని.. ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని నిలబెట్టేది బ్యాలెట్ పేపరేనని తెలిపారు. వైసిపి నాయకుడు పోరెడ్డి నరసింహారెడ్డి ఇంట్లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆనాడు ప్రజాస్వామ్యాన్ని ప్రజలు నిర్ణయించే వారని, కానీ నేడు ఇవిఎం యంత్రాలు నిర్ణయిస్తున్నాయని తెలిపారు. స్వార్థపూరిత రాజకీయ శక్తులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయన్నారు. నాలుగు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల ప్రక్రియ ముగిసిన అరగంటకే ప్రజలు ముక్తకంఠంతో ఈ తీర్పు తామిచ్చింది కాదని ఇవిఎంలదేనని ఆరోపించారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు ముక్తకంఠంతో మాట్లాడిందే నిజమన్నారు. దీనిపై ప్రజలకున్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఈ పని కేంద్ర ఎన్నికల సంఘం చేయాలని ఆయన సూచించారు. అయితే కేంద్ర ఎన్నికల సంఘం బిజెపి గుప్పిట్లో కీలుబొమ్మగా తయారైందన్నారు. ప్రజాస్వామ్యాన్ని బతికించాల్సిన బాధ్యత సుప్రీం కోర్టుదే అన్నారు. ఇవిఎంల ద్వారానే మళ్లీ ఎన్నికలకు పోతాం అని మొండికేస్తే ఎన్నికలు జరపడమే అనవసరమన్నారు. ప్రపంచవ్యాప్తంగా 18దేశాలు మాత్రమే ఇవిఎంల ద్వారా ఎన్నికలు జరుపుతున్నాయని పేర్కొన్నారు. బ్యాలెట్‌పేపర్ ద్వారానే ఎన్నికలు జరపాలని, అప్పుడే స్వచ్ఛమైన ప్రజాతీర్పు వెల్లడవుతుందన్నారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి

అభివృద్ధి పనులను ఆపలేరు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అభివృద్ధి పనులు ఆపాలని ప్రయత్నిస్తే అది కుదరదని ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం చైర్మన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో అందరూ సమానమే.. పార్టీలతో పనిలేదని తెలిపారు. అందరి అజెండా నగర పంచాయతీ అభివృద్ధే లక్ష్యమన్నారు. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా ముందుకు వెళతామన్నారు. గతంలో నిజాయితీగా అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాకుండా ఉంటే వాటిని విచారించి బిల్లులు చేయాలని కమిషనర్‌కు సూచించారు. మూడు రోజులు పాటు వర్షాలు ఉన్నాయని, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. శానిటేషన్ పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. పట్టణంలో ఖాళీ స్థలంలో ఉన్న కంపచెట్లను తొలగించేలా నోటీసులు ఇవ్వాలని సూచించారు. సక్రమంగా విధులకు హాజరు కాకపోతే తొలగింపు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైసిపి కౌన్సిలర్ పోచిరెడ్డి, 8వ వార్డు కౌన్సిలర్ సమస్యలను వివరించారు. సమావేశంలో కమిషనర్ వెంకటరమణారెడ్డి, డిఇ సురేంద్ర, తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఎడి, సంబంధిత అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వికసిత భారత్‌లో ఆకలి కేకలు!

- పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలోని బిజెపి పాలనలో ప్రధాని మోడీ ఓ వైపు వికసిత భారత్ అంటుంటే.. మరోవైపు దేశంలో ఆకలి కేకలు వినిపించడం దురదృష్టకరమని పిసిసి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 ఎడాదిలో ప్రపంచ ఆకలి సూచీలోని 127 దేశాలలో భారత్ స్థానం 105గా నిలవడం శోచనీయమన్నారు. సీరియస్ కేటగిరిలో 45 దేశాలుంటే అందులో భారత్ ఒకటన్నారు. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక మనకంటే మెరుగైన స్థానంలో ఉన్నాయని తెలిపారు. దేశంలో 13.7 శాతం మంది పోషకాహార లోపంతో ఉన్నట్లు చెప్పారు. ఇది దేశానికి సిగ్గు చేటని విమర్శించారు. విజయ దశమి సందర్భంగా కర్నూలు జిల్లాలోని హోలిగుండ మండలం దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఊరేగింపు సందర్భంగా కర్రల సమరం జరగడం ఆటవిక చర్యగా ఆయన పేర్కొన్నారు. ఎఎస్‌పితోపాటు 800 మంది పోలీసుల సమక్షంలో ఈ ఆటవిక క్రీడ జరగడం గర్హనీయమని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లోనైనా ఈ అనాగరికం, ఆటవిక, అమానుష కార్యక్రమానికి ముగింపు పలికి ప్రశాంత వాతావరణంలో ఆధ్యాత్మిక శోభతో మాల మల్లేశ్వర స్వామి ఊరేగింపు జరిగేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని తులసిరెడ్డి కోరారు. బుడ్డ శనగ విత్తనాల కొరతను నివారించాలని కోరారు. రాష్ట్రంలో ప్రత్యేకించి రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో రబీలో బుడ్డ శనగ ప్రధానమైన పంట అన్నారు. పాత బకాయిలు ప్రభుత్వం చెల్లిస్తేనే ఈ రబీకి బుడ్డ శనగ విత్తనాలను సేకరించి సరఫరా చేస్తామని సరఫరాదారులు చెప్పడం ప్రభుత్వ పాలన విఫలమనే దానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే విత్తన సరఫరాదారులకు పాత బకాయిలు చెల్లించి రైతులకు ఇబ్బందులు లేకుండా రబీలో బుడ్డ శనగ విత్తనాల కొరత లేకుండా చూడాలని తులసిరెడ్డి కోరారు.

జిల్లా స్థాయికి ఎంపికైన ఐడిపిఎస్ విద్యార్థి

ప్రజాశక్తి - చాపాడు

బి.హర్షిత

ప్రొద్దుటూరు జార్జిక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 స్థాయి బ్యాడ్మింటన్ పోటీలో చాపాడు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 7వ తరగతి విద్యార్థి బి.హర్షిత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఆ మేరకు పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో వివిధ రకాల క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని, పిల్లలను వారు ఎంచుకున్న క్రీడలో నిష్ణాతులుగా తయారు చేసేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్లవేళలా కృషి చేస్తారని తెలిపారు. ఐడిపిఎస్ నుండి జిల్లా స్థాయికి ఎంపిక కావడం ఎంతో సంతోషమన్నారు. జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు.

చోరీ కేసులో రెండో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఈ ఏడాది ఆగష్టు 13న స్థానిక కదిరి రింగ్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో జరిగిన చోరీ కేసులో రెండవ నిందితుడు అలెగ్జాండర్‌ను ఆదివారం రాత్రి అర్బన్ ఎస్ఐ నారాయణ తన సిబ్బందితో అరెస్టు చేసినట్లు సిఐ జీవన్ గంగానాథ్ బాబు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటి నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టు హాజరు పరిచామన్నారు. అలెగ్జాండర్ వృత్తిరీత్యా డ్రైవర్. పులివెందుల ఆర్టీసీ బస్టాండ్ వద్ద సంచరిస్తూ ఉండగా అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.లక్ష స్వాధీనం చేసినట్లు సిఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, కానిస్టేబుల్ రామ్‌రమేష్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE IVth ADDITIONAL JUNIOR CIVIL JUDGE (Special Moblie Court), KADAPA

O.S.No. 198/2024

V.V.Seshaiah Naidu, S/o V.Chinnanaidu, Hindu, aged 54 years, Cultivation Resident D.No.2/200, Kondayapalli, Chinnachowk, Kadapa City, Kadapa District. **...Plaintiff**

Vs

Pothineni Narayana Son of P.Venkataiah, Hindu, aged about 58 years, Rice Business, Resident D. No.36/198-11-1, Near Manasa Kalyan Mandapam, Chinnchowk, Kadapa City, Kadapa District. **...Defendant**

ప్రతివాదికి దావా సమను

పై నెంబరు దావాను వాది దావా బాకీ మొత్తం రూ.12,28,000-00/-లను రాబట్టుకొనుటకు గాను నీ పైన దాఖలు చేసి ఉన్నారు. అయితే పై నెంబరు దావా యందు ప్రతివాది అయిన నీవు హాజరు అగుటకు గాను 25/10/2024వ తేదీన వాయిదా వున్నది. అట్టి దావా నందు నీకు ఏమైన ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టు వారి ఎదుట 25/10/2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై కోర్టు వారికి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట నీ పరోక్షము నందు తీర్మానించబడును.

తేది: 25.10.2024.

//By Order of the Court//

L. SIVA SANKAR REDDY
Advocate,
Kadapa. Cell No: 9701764002.

IN THE COURT OF THE HONORABLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE : KADAPA

O.S.No. 278/2020

Velicherla Sreenivasulu Reddy,S/o V.Pulla Reddy, Aged about 46 years, Hindu, R/at.D/No. 3/194-A, Ramanapalli Village, Chennur Mandal, Kadapa District. **...Plaintiff**

Vs

2. Kottakota Veerabhadra Achari, S/o K.Chinna Veerachari, Hindu, aged about 60 years, residing at D.No. 31/25, RIMS Road, Sivanandapuram, Kadapa City and District.
4. Ramana Sree Lakshmi, W/o R.Chandra Mohan Reddy, Hindu, aged about 45 years, residing at Reddyvari Veedhi, Ramanapalli Village & Post, Chennur Mandal, Kadapa District. PinNo.516162 and Others.

...Defendants No.2 and 4

ప్రతివాదులకు కోర్టు సమన్లు

పైన తెలిపిన వాది ప్రతివాదులైన మీపై పై కోర్టులో సివిల్ దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా యందు మీకేమైన ఆక్షేపణలు వున్న యెడల 23.10.2024వ తేది ఉదయం 10.30గం॥లకు పై కోర్టు నందు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై కోర్టు వారికి తెలుపుకొనవలసినది. లేనంతట పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//

T.MOHAN KRISHNA
B.RAJA SEKHAR
Advocates for Plaintiff
Kadapa.

IN THE COURT OF THE HONORABLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE : KADAPA

I.A.No. 670/2020
O.S.No. 278/2020

Velicherla Sreenivasulu Reddy,S/o V.Pulla Reddy, Aged about 46 years, Hindu, R/at.D/No. 3/194-A, Ramanapalli Village, Chennur Mandal, Kadapa District. **...Petitioner/Plaintiff**

Vs

2. Kottakota Veerabhadra Achari, S/o K.Chinna Veerachari, Hindu, aged about 60 years, residing at D.No. 31/25, RIMS Road, Sivanandapuram, Kadapa City and District.
4. Ramana Sree Lakshmi, W/o R.Chandra Mohan Reddy, Hindu, aged about 45 years, residing at Reddyvari Veedhi, Ramanapalli Village & Post, Chennur Mandal, Kadapa District. PinNo.516162 and Others. **...Respondents No.2 and 4/ Defendants No.2 and 4**

ప్రతివాదులకు కోర్టు సమన్లు

పైన తెలిపిన పిటిషను దావా నందు 23.10.2024వ తేదీన వాయిదా వున్నది. సదరు పిటిషను దావా యందు మీకేమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 23.10.2024వ తేది ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు నందు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై కోర్టు వారికి తెలుపుకొనవలసినది. లేనంతట పై పిటిషన్‌ను దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//

T.MOHAN KRISHNA
B.RAJA SEKHAR
Advocates for Plaintiff
Kadapa.

IN THE COURT OF THE HON'BLE 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE: KADAPA

O.S.No. 809 OF 2020

Kataru Nagabhushan Reddy, Son of Kataru Malla Reddy, Hindu, aged about 57 years, reisiding at D.No.9/81, Kapu Street, Mannuru Village, Rajampeta Mandal, Kadapa District. **...Petitioner/Plaintiff**

Vs

Pillamanchala Narayanamma, Having Died Her L.R's.
1. P.M.Anasuya Devi, Wife of Gorla Prabhakar Reddy, Daughter of late P.M.Ganga Reddy & late Pillamanchala Narayanamma, Hindu, aged about 48 years, residing at Door No. 7/22, Jaya Nagar Colony, Kadapa City.
2. P.M.Narmada, wife of Dr.Sarath Reddy, Daughter of late P.M.Gangi Reddy & Late Pillamanchala Narayanamma, Hindu, aged about 40 years, Residing at Door No.25-23, Reddyvaripalli Village, T.Sundupalli (Mandal) Kadapa District.
3. P.M.Murdula, Wife of Lomada Bhuvaneswar Reddy, Daughter of late P.M.Gangi Reddy & late Pillamanchala Narayanamma, Hindu, aged about 36 years, Residing at D.No.7/22, Jaya Nagar Colony, Kadapa City.

...Respondents/Defendants No.5, 6 & 8

SUMMONS TO DEFENDANT NO.5, 6 & 8 RULE 1 & 5 C.P.C

Where as the Plaintiff herein filed the suit against you being Defendant No.5,6 & 8 for recovery of debt due under Suit Pronotes and its back side endorsements and the said suit stand posted on 18.10.2024 for your appearance therefore you being the Defendant No.5, 6 & 8 here by instructed to appear before the Hon'ble court on 18.10.2024 at 10.30 AM sharp personally or through an Advocate, failing which the matter will be decide as Ex-parte.

//By Order of the Hon'ble Court//

S.MD.KHALEEL GHOUSE
Advocates for Plaintiff

IN THE COURT OF THE HON'BLE 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE: KADAPA

I.A.No. 847 OF 2020
O.S.No. 809 OF 2020

Kataru Nagabhushan Reddy, Son of Kataru Malla Reddy, Hindu, aged about 57 years, reisiding at D.No.9/81, Kapu Street, Mannuru Village, Rajampeta Mandal, Kadapa District. **...Petitioner/Plaintiff**

Vs

Pillamanchala Narayanamma, Having Died Her L.R's.
1. P.M.Anasuya Devi, Wife of Gorla Prabhakar Reddy, Daughter of late P.M.Ganga Reddy & late Pillamanchala Narayanamma, Hindu, aged about 48 years, residing at Door No. 7/22, Jaya Nagar Colony, Kadapa City.
2. P.M.Narmada, wife of Dr.Sarath Reddy, Daughter of late P.M.Gangi Reddy & Late Pillamanchala Narayanamma, Hindu, aged about 40 years, Residing at Door No.25-23, Reddyvari palli Village, T.Sundupalli (Mandal) Kadapa District.
3. P.M.Murdula, Wife of Lomada Bhuvaneswar Reddy, Daughter of late P.M.Gangi Reddy & late Pillamanchala Narayanamma, Hindu, aged about 36 years, Residing at D.No.7/22, Jaya Nagar Colony, Kadapa City.

...Respondents/Defendants No.5, 6 & 8

NOTICE TO RESPONDENTS/DEFENDANT NO.5,6 &8 UNDER ORDER 38 RULE 5 C.P.C

Where as the Petitioner/Plaintiff herein filed the Petition/suit against you being Respodnent/ Defendant No.5,6 & 8 for recovery of debt due under Suit Pronotes and its back side endorsements filed the above I.A. for Attachment before judgement and the said I.A./Suit stand posted on 18.10.2024 fou your appearance therefore you being the Respondents/ Defendants No.5,6 & 8 here by instructed to appear before the Hon'ble court on 18.10.2024 at 10.30 AM sharp personally or through an Advocate, failing which the matter will be decide as Ex-parte.

//By Order of the Hon'ble Court//

S.MD.KHALEEL GHOUSE
Advocates for Petitioner/Plaintiff